క్లుప్తంగా

ముగిసిన యాత్రా మహోత్సవాలు



గాయత్రీదేవికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: పట్టణంలోని గాయత్రి కాలనీలో ఉన్న గాయత్రీదేవి ఆలయ 31వ వార్షికోత్సవం పురస్కరించుకుని, మూడు రోజులుగా నిర్వహిస్తున్న యాత్రా మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఉదయం ఆలయానికి వెళ్లి, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కూడా పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని, విశేషార్చనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టినట్లు ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, కొండవేటి వివేకానందరావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేత కలమట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



సంతకవిటి: పోలింగ్ కేంద్రం పరిశీలనలో ట్రైనీ డీఎస్పీ మహేంద్ర తదితరులు

సంతకవిటి: మండలంలోని మందరాడ పోలింగ్ కేంద్రాన్ని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ షేక్ శంకర్‌లు శుక్రవారం కలిసి పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు అనుకూలమైన పరిస్థితులు అక్కడ ఉన్నదీ లేనిదీ గమనించారు. ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని సిబ్బందికి వారు సూచించారు.

బాధ్యతల స్వీకరణ

వంగర: మండల తహసీల్దార్‌గా పి.చిరంజీవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కె.సుధాకర్.. అల్లూరిసీతారామరాజు జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా ఆర్‌డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న చిరంజీవిని బదిలీ చేశారు. పదవీ బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన డీపీవో శ్రీధర్‌రాజు

బాడంగి: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీవో(జిల్లా పంచాయతీ అధికారి) శ్రీధర్‌రాజు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన పంచాయతీల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధి విషయంలో కార్యదర్శుల పనితీరు సరిగా లేకపోవడంతో డీపీవో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు ఖర్చు చేయడంలో, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించడంలో, ఇంటి పన్ను వసూలు చేయడంలోనూ వెనకబడి ఉండడంతో ఆయన సదరు ఉద్యోగులపై మండిపడ్డారు. ఇలాగైతే ఎలా అని, మరోసారి ఇదే పునరావృతమైతే ఉపేక్షించేది లేదన్నారు. పంచాయతీ అభివృద్ధి పనుల వివరాలను ఆన్‌లైన్‌లో త్వరితగతిన అప్‌లోడ్ చేయాలన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులను ఈ నెలాఖరులోగా ఖర్చు చేయాలని, జీపీడీపీ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయండి

సంతకవిటి: మండల వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ నుంచి చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆమె కార్యక్రమ ఏర్పాట్లపై ఆరాతీశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్‌స్టేషన్లు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి మరీ ఐదేళ్ల వయసు లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అలాగే ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేపట్టాలన్నారు. వైద్యాధికారి నాగేంద్రప్రసాద్, మండల పరిషత్ ఏవో రఘునాథాచారి, ఈవోఆర్‌డీ పుష్పాంజలి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రాజాంసిటీ: మండలంలోని పెనుబాక వద్ద గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని(జూదరులు) అరెస్ట్ చేసి, రూ.10520 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మోహనరావు తెలిపారు.

• ప్రగతి బాట





చిత్రంలో కనిపిస్తున్నది..రెడ్డిపేట గ్రామానికి వెళ్లే రోడ్డు. గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఏ చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయమయ్యేది. అటువైపుగా వెళ్లే వారంతా నానా అవస్థలు పడేవారు. ఒక్కోసారి జారిపడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయని వాహనదారులు తెలిపారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించింది. రూ.2.85 లక్షల నిధులతో పాలకొండ-రాజాం ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి రోడ్డు నిర్మించారు. చాలా రోజులకు రోడ్డు కష్టాలు తీరడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ మొర విని, సమస్య తీర్చినందుకు గాను ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

– రేగిడి.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లపట్టాలు అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

- ఇళ్లపట్టాల పంపిణీలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రంలోని ప్రతీ పేదవాడు ఉన్నతంగా ఉండాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్లపట్టాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి సొంతిల్లు ఇవ్వడంతో పాటు దానిపై సర్వహక్కులు కలిగేలా రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు అందివ్వడం జరుగుతోందన్నారు. దీంతో లబ్ధిదారుకు ఆపద సమయంలో తన ఇంటిని అమ్ముకునే వీలుంటుందన్నారు. ఇవే ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే గతంలో ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వేలాది రూపాయాలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. గతంలో ఇళ్లపట్టాలు ఇచ్చినా వాటికి రిజిస్ట్రేషన్లు చేసి, ఇచ్చేవారు కాదన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజాం మున్సిపాలిటీ పరిధిలో 690 మందికి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు ఇస్తున్నామని, లబ్ధిదారులు ఈ విషయాన్ని గుర్తించి, రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగన్‌కు అండగా నిలిచి, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసిన ఈ ఇంటి పట్టాలను మహిళల పేరిట ఇవ్వడం జరుగుతోందని, ఇవే పత్రాలు బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు కూడా ఉపయోగపడతాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ప్రజలకు మేలు చేసిన ఏ ఒక్క పనీ ఇటువంటిది జరగలేదన్నారు. సీఎం జగనన్న ప్రజలందరికీ మేలు జరిగేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మేలును వివరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ సభ్యులంతా ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి, వివరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బూత్ కన్వీనర్ల సమావేశానికి హాజరైన ఆయన రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పార్టీ తరఫున ఎక్కడా లోటుపాట్లు రాకూడదనే ఉద్దేశ్యంతో బూత్ కమిటీలను నియమించామని తెలిపారు. కమిటీ సభ్యులంతా ఇంటింటికీ వెళ్లి, ఆ ఇంటికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించాలన్నారు. ప్రతీ బూత్ స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించి, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసుకోవాలన్నారు. ఇదే కార్యక్రమంలో అందరి ముఖ్యమంత్రుల్లో కన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకతను తెలియజేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి హాజరైన రోగులకు వైద్యాధికారులు కళ్యాణబాబు, సోహిణీరాఘవ్‌లు ఆరోగ్య తనిఖీలు చేపట్టి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాడి లక్షుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని గజరాయునివలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య సిబ్బంది వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్స, మెరుగైన వైద్యం అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య బృందం గ్రూపులుగా విడిపోయి మరీ వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య తనిఖీలు చేసి, మందులు అందజేశారు. అలాగే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

రాజాం సిటీ: గ్రామీణుల ఆరోగ్యం మెరుగే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఎంపీడీవో బాసూరి శంకరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాజయ్యపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన వైద్యసేవల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లలేని వృద్ధులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యులు గుణశేఖర్, సిద్దేశ్వరి, ఈఎన్‌టీ వైద్యులు నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: కొమెరలో రోగులకు మెడికల్ కిట్లు అందిస్తున్న సర్పంచ్ లక్షుంనాయుడు, వైద్యాధికారులు



బాడంగి: గజరాయునివలసలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్య సిబ్బంది



బొబ్బిలి: మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్



రాజాం సిటీ: ఆరోగ్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



బాడంగి: గురుకుల కళాశాల సెంటర్‌లో హాల్‌టికెట్ నంబర్లు, పరీక్ష గది చూసుకుంటున్న విద్యార్థులు



సంతకవిటి: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, సీఐ శ్రీనివాస్

బాడంగి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరగ్గా, శనివారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం జరిగిన తెలుగు పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 209 మందిలో 11 మంది, గురుకుల కళాశాల కేంద్రంలో 173 మందిలో 9 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రాల చీఫ్‌లు వి.శంకరరావు, టి.రామదాసు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆర్.జయంతి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వంగర: మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన తెలుగు పరీక్షకు 178 మందిలో ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. హిందీ పరీక్షకు 57 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ కె.నారాయణరావు తెలిపారు.

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర శుక్రవారం సందర్శించారు. పరీక్ష నిర్వహిస్తున్న తీరు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై సిబ్బందిని ఆరాతీశారు. పకడ్బందీగా పరీక్షలు జరిగేలా చూడాలని, విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాజాం సిటీ: మండలంలోని 8 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

తెర్లాం: మండలంలోని పెరుమాళి మోడల్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో శుక్రవారం నుంచి జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. తెర్లాంలోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు, కుమ్మరిపేటలోని కేజీబీవీ విద్యార్థినులు, పెరుమాళి మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఆక్రమణపై కేసు నమోదు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేటకు చెందిన 12 సెంట్ల ప్రభుత్వ స్థలం కొంతమంది ఆక్రమించుకున్నారన్న దానిపై లోకాయుక్త కేసు నమోదు చేసినట్లు ఫిర్యాదుదారు పోల జగన్నాథం విలేకరులకు శుక్రవారం తెలిపారు. గతంలోనూ ఈ ఆక్రమణకు సంబంధించి, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ఆక్రమణ కొనసాగడంతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తక్షణమే ఆక్రమిత ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు వినియోగించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

బొబ్బిలి: మండలంలోని లచ్చయ్యపేట నుంచి ఓ ఆటోలో శుక్రవారం బొబ్బిలి వెళ్తూ ఓ మహిళ తన బ్యాగు, పర్సును ఆటోలోనే మర్చిపోయి దిగిపోయింది. అప్రమత్తమైన ఆటో డ్రైవర్ మర్రి తాతయ్యలు పోలీస్‌స్టేషన్‌కు వాటిని తీసుకువెళ్లి, అప్పగించారు. సీఐ ఎం.నాగేశ్వరరావు బాధితురాలి వివరాలు తెలుసుకుని, స్టేషన్‌కు రప్పించి మరీ బ్యాగు, అందులోని రూ.5 వేల నగదును అప్పగించారు.

పంపిణీకి విత్తనాలు సిద్ధం

బొబ్బిలి: మండలంలోని రైతులకు పంపిణీ చేసేందుకు వివిధ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. వేసవిలో అపరాల సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీపై పెసర, నువ్వుల విత్తనాలను అందిస్తోందన్నారు. ప్రస్తుతం 5 క్వింటాళ్ల పెసర విత్తనాలు, 2.6 క్వింటాళ్ల నువ్వుల విత్తనాలు ఉన్నాయన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ



బాడంగి: చినభీమవరంలో పింఛన్లు అందజేస్తున్న వలంటీర్ స్వప్న



తెర్లాం: మండల కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ ప్రశాంత్



రాజాం: బొద్దాంలో పింఛన్ నగదు అందుకుంటున్న లబ్ధిదారుడు



రేగిడి: వన్నలిలో మంచానపడిన వృద్ధురాలి వద్దకు వెళ్లి, పింఛన్ అందజేస్తున్న వలంటీర్

వాడవాడలా సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారం పండగలా జరిగింది. వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి, బయోమెట్రిక్, ఐరిష్ ఆధారంగా పెన్షన్ నగదు అందజేశారు. మరికొన్ని చోట్ల సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పింఛన్లు అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ హయాంలో ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము అందుతుండడంతో లబ్ధిదారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ



అంబఖండి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం

రేగిడి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో శ్యామలాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని వెంకంపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బాలామృతం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు, పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన శుక్రవారం చేపట్టారు. ఈ ప్రదర్శనను తిలకించిన వారు గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటేనే వారి బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు వ్యాక్సిన్లు..

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టి, చిన్నారులకు వ్యాక్సిన్‌లు వేశారు. చిన్నారులు వ్యాధుల బారినపడకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేయడం జరుగుతోందని, చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లించే వారికి వడ్డీ రాయితీ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లించే వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్‌లోని ఆస్తి పన్నుతో పాటు ఖాళీస్థలాలకు సంబంధించిన పన్నుపై వడ్డీ రాయితీ ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా పన్ను మొత్తాన్ని చెల్లించిన వారందరికీ ఈ వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు.

బొబ్బిలి: ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆమె ఆస్తిపన్ను బకాయిలపై చర్చించారు. పన్నుల వసూలును వేగవంతం చేయాలన్నారు.